క్లుప్తంగా

ఐకమత్యంగా ఉందాం

టెక్కలి: ఐకమత్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధి ఎం.నారాయణరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మాజీ సైనికులకు సంబంధించి రాయితీలు, సంక్షేమ పథకాల లబ్ధి విషయంలో ఐకమత్యంగా పోరాటాలు చేయాలని కోరారు. సమావేశంలో స్థానిక అధ్యక్షుడు జి.సోమేశ్వరరావు, కె.మన్మథరావు, ఎస్.కృష్ణారావు, కాంతారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



విత్తన బంతులు తయారు చేస్తున్న మహిళా రైతులు

కంచిలి: వరి పంట సాగులో విత్తన గుళికలు విధానం ఎంతో మంచిదని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి టి.శివానందం అన్నారు. అంపురం గ్రామంలో మహిళా రైతులతో కలిసి ప్రకృతి వ్యవసాయం గ్రామ సంఘం పరిధిలో ఉన్న రైతులతో ప్రకృతి వ్యవసాయం సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళా రైతు గడ్డం మీనాకు చెందిన సెంట్లు విస్తీర్ణంలో వరి విత్తనాలను విత్తన బంతులుగా తయారుచేసి విత్తే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో మండల యాంకర్ కుమారి, ఐసీఆర్పీ రేవతి పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థికసాయం



వేణుకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీకి చెందిన తర్లాన వేణు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమయ్యాడు. అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకున్న కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ కమిటీ సభ్యులు అండగా నిలిచారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఎనిమిది వేల రూపాయలను వేణు కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. కమిటీ సభ్యులు వంజరాపు గంగులు, కంబాల అప్పలరాజు, దాసరి కిట్టు, ఈరు రామకృష్ణ, రాజు, సంతు పాల్గొన్నారు.

సామాజిక భవనం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: అన్ని గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనుల్ని ప్రభుత్వం చేపడుతోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన పనులకు నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. చిన్న కొజ్జిరియా పంచాయతీ పరిధి చంద్రపుట్టుగ గ్రామంలో ఆరు లక్షల రూపాయలతో చేపట్టనున్న సామాజిక భవనం నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. స్థానిక సర్పంచ్ గొనప సీతారాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎలుసూరి బాబావతి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఉప సర్పంచ్ సహదేవ్, దుర్గాసి ధర్మారావు, కొణపల సురేష్, ఎలుసూరి అప్పారావు, రమణ, శంకర్ పాల్గొన్నారు.

ప్రజాహితమే రోటరీ సంస్థ ధ్యేయం



మెడికల్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆర్.వి.సుబ్బారావు

కంచిలి: ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టడమే రోటరీ సంస్థ ధ్యేయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు అన్నారు. మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ప్రాంగణంలో రూ. 5 కోట్లు అంచనా వ్యయంతో 'రోటరీ ఉద్దానం మెడికల్ సెంటర్'కు, మండల కేంద్రంలో మఠం కంచిలి శ్మశానవాటిక అభివృద్ధి కోసం రూ. 20 లక్షలతో చేపట్టనున్న పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. మఠం కంచిలి శ్మశానవాటిక అభివృద్ధి పనులకు మంజూరు చేసిన నిధుల్లో సగం నిధులు పది లక్షల రూపాయలను కంచిలికి చెందిన కొత్తకోట నాగరాజు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, రోటరీ సోంపేట అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్టారావు, కంచిలి సర్పంచ్ లండ లక్ష్మి, లోకనాథం, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

● ఆదర్శం



కోటబొమ్మాళి బాలుర హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. రెండు లక్షల రూపాయలు వెచ్చించి మైదానాన్ని బాగు చేయించేందుకు పూనుకున్నారు. ట్రాక్టర్లతో మట్టి, కంకరును ఆదివారం తీసుకొచ్చి మైదానంలో వేసి.. జేసీబీతో చదును చేయించారు. మైదానం సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూర్వవిద్యార్థులు కోరాడ సాయిరాం, బి.ద్వారకానాథ్, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.రామకుమార్, బి.గోవిందరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.అనాధిగుప్తా, బి.కిశోర్, బి.శ్రీనివాస్, కె.ప్రతాప్ పాల్గొన్నారు. -కోటబొమ్మాళి

● ఆర్థిక సాయం



వజ్రపుకొత్తూరు మండలం చినవంక గ్రామానికి చెందిన కంసు ఇంద్రావతి అగ్ని ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1996-97) పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. రూ. 30 వేలు సేకరించారు. ఆదివారం ఆమెను పరామర్శించి.. ఆ మొత్తాన్ని అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. -వజ్రపుకొత్తూరు రూరల్

● సంబరం



మందస మండలం ఉద్దాన ప్రాంతమైన రాంపురంలో మూడు రోజులు జరగనున్న ఉజ్జిడమ్మొరు దేవత ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో నిర్వహించే ఉత్సవాలను రైతులకు శుభ సూచికంగా భావిస్తారు. సంబరం నిర్వహించాకే దమ్ములకు సిద్ధమవుతారు. ఇదే సమయంలో మరిడమ్మతల్లి సంబరాలు కూడా చేస్తారు. మేళ, తాళాలు, మంగళవాయిద్యాలతో అమ్మవార్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ నాయకులు, గ్రామపెద్దలు ఢిల్లేశ్వరరావు, సంతోష్, రామారావు పాల్గొన్నారు. -మందస

ఆపదలో ఉన్నవారికి అండగా..

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్నవారికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అండగా నిలిచారు. ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కోటబొమ్మాళి మండలం చలమయ్యపేటకు చెందిన జుత్తు సూర్యనారాయణ, అంజలి కుమారుడు దేవాన్స్ ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం దేవాన్స్ వైద్యం కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేసినప్పటికీ ప్రాణం నిలవలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పూండికి చెందిన యువతరం సేవా సమితి భావించింది. 20 వేల రూపాయలను ఆ కుటుంబానికి ఆదివారం అందజేశారు. సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, ప్రతినిధులు గాడి అఖిల్, జ్యోతి, జి.శరత్, ఎ.లక్ష్మణ్ ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: ఆర్థిక సాయం చేస్తున్న యువతరం సేవా సమితి సభ్యులు

టెక్కలి రూరల్: మోదుగువలస గ్రామానికి చెందిన నిమ్మక అర్జున పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడు. కష్టపడే వ్యక్తి అనారోగ్యం బారిన పడడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బంది పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న టెక్కలికి చెందిన అమ్మహెల్పింగ్ హ్యాండ్ సభ్యులు పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని గ్రామానికి వెళ్లి అర్జునకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఉదయ్‌సాగర్, సభ్యులు దుర్గారావు, లక్ష్మణ్, కార్తీక్ ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: గుడ్డిభద్ర కొజ్జిరియా గ్రామానికి చెందిన గేదెల లక్ష్మి ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న పేటూరుకు చెందిన యువకులు స్పందించారు. మృత్యుంజయేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి ఐదు వేల రూపాయల నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు.



టెక్కలి రూరల్: అర్జున కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: సాయాన్ని అందజేస్తున్న పేటూరు యువకులు

రోటరీ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దుద్ది శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. రూ. పది లక్షల రోటరీ నిధులతో సులబ్ కాంప్లెక్స్, మరో రూ. పది లక్షలతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రోటరీ సేవలను కొనియాడారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడుగా దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శిగా పి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షుడుగా నగిరి శరత్, జాయింట్ కార్యదర్శిగా ఎఫ్.శ్రీనివాసరావు, కోశాధికారిగా రవికుమార్ ఎన్నికయ్యారు. జిల్లా గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు, సంఘ ప్రతినిధులు తిరుమలరావు, గోవిందరావు, కిరణ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రోటరీ ప్రతినిధులు

మంచినీటి పైపులైన్ లీక్

● ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



సీతమ్మతల్లి మందిరం వద్ద పైపులైన్ లీకవుతున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీలో రెండు రోజులుగా మంచినీటి సరఫరాకు అంతరాయం తలెత్తింది. పెదంచల బీటీ రోడ్డు, సీతమ్మతల్లి మందిరం పరిసరాల్లో ప్రధాన పైపులైన్ లీకవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లీకేజీని గుర్తించిన నీటి సరఫరా విభాగం సిబ్బంది విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి వారు మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, చైర్మన్ బళ్ల గిరిబాబులు అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేతకు నిర్ణయం తీసుకున్నారు. పైపులైను మరమ్మతులను తక్షణమే ప్రారంభించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకుండా ట్యాంకర్ల ద్వారా 31 వార్డుల్లో నీటిని సరఫరా చేస్తున్నారు.

అలరించిన కోలాటం



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణ, కోలాటం, కోయి నృత్యాలతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.


మంకినమ్మతల్లి వీధిగా పేరు పెట్టాలని వినతి



కౌన్సిలర్‌కు వినతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డు పరిధిలోని ఓ వీధికి మంకినమ్మతల్లిగా పేరు పెట్టాలని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు కోరారు. కొన్నేళ్ల క్రితం ఉపాధ్యాయులు ఇక్కడ ఇళ్లను నిర్మించుకున్నప్పటికీ ఇంకా పేరు పెట్టలేదన్నారు. సమీపంలో ఉన్న అమ్మవారి పేరును వీధికి ఖరారు చేయాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి, నాయకుడు ఆనందరావుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు వెంకటరమణ, టి.కృష్ణారావు తదితరులున్నారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం



భూమి పూజ చేస్తున్న దృశ్యం

సోంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు తడక యశోద అన్నారు. పలాసపురం గ్రామంలో కొత్తచెరువు మెట్ల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పిరియా కృష్ణారావు, రమేష్, దున్న మోహనరావు, బైరి పాల్గొన్నారు.
పూజ చేస్తున్న దృశ్యం

ఉపాధి పనులపై ప్రజావేదిక రేపు

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై మంగళవారం ప్రజావేదిక జరగనుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం పది గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు డ్వామా జేతు హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వేతనదారులు హాజరు కావాలని కోరారు.

ఆలయ ధర్మకర్త మృతికి సంతాపం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులోని రామమందిర ఆలయ ప్రాంగణంలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయ ధర్మకర్త నిరంజన్ త్రిపాఠి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మృతిపై ఒడియా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి బాబూరావు పండా, సభ్యులు రాఘవ పండా, కైలాస్ దాస్, అరుణ్‌కుమార్ ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 వేల వితరణ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పదో వార్డు కొత్త పారసాంబలోని ముత్యాలపోలమ్మ పురాతన గ్రామదేవత ఆలయ పునః నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారు. 12వవార్డు హరిజన వీధికి చెందిన చెరుకుపల్లి నేతాజీ రూ.10 వేలు వితరణ చేశారు. వార్డు ఇన్‌చార్జి శర్వాణ రవి ద్వారా కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. పనులను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రసాదరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

షట్టర్ల ఏర్పాటు

సరుబుజ్జిలి: రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. ఏళ్ల తరబడి యరగాం-పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌కు పురుషోత్తపురం వద్ద పడుతున్న ఇబ్బందులు రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుచేయించారు. ఈ మేరకు ఆదివారం షట్టర్లు పనులు ప్రారంభించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేసారు. ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లి రామ్మోహనరావు, ఓపెన్‌హెడ్ చానల్ ఇంజినీర్లు, రైతులు పాల్గొన్నారు.



షట్టర్ల పనులు పర్యవేక్షిస్తున్న సత్యనారాయణ

శరవేగంగా ఫ్లైఓవర్ పనులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం కూడలిలో హైవే ఫ్లైఓవర్, అండర్ పాసేజ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టెక్కలి రోడ్డు నుంచి వచ్చే వాహనాలు రాకపోకలకు ఫ్లైఓవర్ కింద పాస్‌జేను ఏర్పాటు చేస్తున్నామని హైవే అధికారులు తెలిపారు. పాతపట్నం నుంచి నేరుగా టెక్కలి, కొరసవాడ నుంచి టెక్కలి వైపు వెళ్లడానికి అండర్ పాసేజ్ ఉపయోగపడుతుందన్నారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ పనులు చేస్తున్నామని, అందులో భాగంగా పెంట్రోల్ బంక్ వద్ద పనులు ప్రారంభించామని తెలిపారు.



నీలమణిదుర్గ ఆలయం ముందు ఫ్లైఓవర్, అండర్ పాసేజ్ పనులు చేపడుతున్న దృశ్యం

హుండీ ఆదాయం రూ.60,460

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో రెండు హుండీల ఆదాయం రూ. 60,460 వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కూన బాలకృష్ణ ఆదివారం తెలిపారు. గత సోమవారం ఆలయంలోని నాలుగు హుండీలు తెరిచామన్నారు. ఈ రెండు హుండీల తాళాలు ఆ సమయంలో తెరుచుకోకపోవడంతో.. వాటిని మరళా ఆదివారం సభ్యుల సమక్షంలో తెరిచి లెక్కించామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులు జె.కె.వెంకుబాబు, బలివాడ రాజేష్‌శర్మ, గుండ్ల బాబు, శిల్లా మల్లికార్జునరావు, కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, పైడి అయ్యప్ప, కూన రామకృష్ణ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

కొత్తూరు: రైతులకు అందుబాటులో యూరియా, డీఏపీతోపాటు పలు రకాల ఎరువులు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద అందుబాటులో ఉన్నట్లు సంఘం అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం 40 మెట్రిక్ టన్నులు యూరియాతోపాటు డీఏపీ ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ఆర్‌బీకేలకు ఎరువులు కేటాయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ముందస్తుగా ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఖరీఫ్ పనులు మొదలు కావడంతో ఎరువులు కొరత రాకుండా పీఏసీఎస్ ద్వారా అవసరమైన ఎరువులు రైతులకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు అందజేసినట్లు చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా పథకం అమలు చేస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఇంటి వద్దకే నాణ్యమైన వరి విత్తనాలు పంపిణీ చేశామన్నారు.

చట్టాలు నిర్వీర్యం

పాతపట్నం: చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ ఆరోపించారు. స్థానిక అమ్మవారి ఆలయం సమీపంలోని సప్తగిరి కల్యాణ మండపంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 20వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు బొయిన అప్పలనాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు జరుగుతాయన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు చాపర సుందర్‌లాల్ మాట్లాడుతూ మహాసభల్లో తీర్మానాలను, నూతన కౌన్సిల్, కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కార్యదర్శి ఎల్.వెంకటరావు, చాపర వెంకటరమణ, వాసుదేవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేఖర్

శ్రేయా మిశ్రోకు జూరీ అవార్డు

పాతపట్నం: విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఏయూ సంగీత నృత్య విభాగం, నాట్య రవళి మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అఖిల భారత సంగీత నృత్య ప్రదర్శన నిర్వహించారు. పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రో జూరీ అవార్డు దక్కింది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం, ఒడిస్సీ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీలకు ఒడిశా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడిలో శ్రేయామిశ్రో చేసిన నృత్య ప్రదర్శనకు (ప్లేట్ డాన్స్) అవార్డు దక్కింది. సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి బి.ఎస్.ఎన్.రాజు, ఆంధ్రా యూనివర్సిటీ సంగీత నృత్య విభాగం అధిపతి ప్రొఫెసర్ అనూరాధ, ప్రొఫెసర్స్ సులేమన్, మహమ్మద్ ఖాన్, నాట్య రవళి వ్యవస్థాపకుడు మహేష్ బాబు, నటరాజ్ పరమేశ్వరన్, విజయవాణి తదితరులు పాల్గొన్నారు.



శ్రేయా మిశ్రోకు అవార్డు, మెమొంటో అందజేస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ రాజు